క్లుప్తంగా

క్రీడలతో స్నేహభావం పెరుగుతుంది



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న తహసీల్దార్ సైదులు, ఎస్సై శంకరరావు

కొణిజర్ల: క్రీడలతో యువతీ యువకులలో ఆత్మ స్థైర్యంతో పాటు స్నేహభావం కూడా పెరుగుతుందని తహసీల్దార్ దొడ్డారపు సైదులు, ఎస్సై జె.శంకరరావు అన్నారు. మండలంలోని తనికెళ్లలో గడల సీతారామయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు గడల భాస్కరరావు నిర్వహించిన గ్రామస్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం వారు ప్రారంభించారు. యువతను ప్రోత్సహించడానికి క్రీడా పోటీలు నిర్వహిస్తున్న భాస్కరరావును అభినందించారు. కార్యక్రమంలో పొట్లపల్లి గోపి, మేకల మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



దీక్షనుద్దేశించి మాట్లాడుతున్న తిరుమలరావు

వైరా: ఇనాం భూములు సమగ్ర సర్వే చేయాలని డిమాండ్ చేస్తూ 9 మంది ఇనాం పట్టాదారుల వారసులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాల్గో రోజుకు చేరుకున్నాయి. ఇనాం పట్టాదారుల వారసులకు భూమి హక్కు కల్పించకపోతే దీక్షలు మరింత ఉధృతం చేస్తామని ఇనాం పట్టాదారుల వారసుడే పమ్మి తిరుమలరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు వారి దీక్షకు మద్దతు పలికారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, విజయ్, ప్రేమ్‌కుమార్, రాంబాబు, భూపతిరావు, నవీన్, రాజు, విజయ్, సురేష్, నాగరాజు, వెంకటమ్మ, కోటయ్య, మరియమ్మ, బంగారమ్మ, సుగుణమ్మ, వెంకటమ్మ, సీతమ్మ, దేవకర్ణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న తిరుపతిరావు

పెనుబల్లి: ప్రభుత్వం వారం రోజుల్లో గొర్రెలను పంపిణీ చేయాలని గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు గాయం తిరుపతిరావు డిమాండ్ చేశారు. మండలంలోని మండాలపాడులో ఆదివారం నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. 10 నెలల క్రితం డీడీలు తీసిన వారికే ఇప్పటి వరకు గొర్రెలు పంపిణీ చేయకుండా, మరలా హడావుడి చేస్తూ డీడీలు కట్టిస్తున్నారన్నారు. ఇది కూడా మోస పూరిత చర్యయే అని అన్నారు. వారంలోగా గొర్రెల పంపకం చేపట్టకపోతే ఉద్యమాలు, ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ సభ్యులు మురళీ, శ్రీను, నరసింహారావు, వెంకటకృష్ణ, సత్యం, వెంకటేశ్వరరావు, వెంకయ్య, ప్రసాద్, సత్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

కారేపల్లి: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ అన్నారు. ఆదివారం కారేపల్లి మండలం పేరుపల్లి గ్రామంలో యూత్ నాయకులు బోళ్ల రమేష్ ఇంట్లో శుభకార్యానికి ఆయన హాజరైయ్యారు. అనంతరం మండలంలో పర్యటించి మాట్లాడారు. దేశ ప్రజలంతా నేడు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజక వర్గ నాయకుడు మాలోత్ రాందాస్ నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంతోష్, నాయకులు చంద్రప్రకాశ్, టోనీవీరప్రతాప్, హర్షా నాయక్, అప్సర్, వినోద్, బోళ్ల రమేష్, జానీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ భూముల కౌలుకు వేలం

చింతకాని: మండల కేంద్రంలో ఉన్నటువంటి శ్రీ చెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన వ్యవసాయ భూములకు సోమవారం బహిరంగ కౌలుకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సీహెచ్ రామకోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది కాలపరిమితితో 2023–24 సంవత్సరానికి గానూ ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే రైతులు ముందుగా ఎకరానికి రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని, వేలం పాటను దక్కించుకున్న రైతులు డిపాజిట్ నగదు మినహా వెంటనే మిగిలిన పైకం చెల్లించి కౌలు రశీదును పొందాలన్నారు. వేలం పాట కాలపరిమితి ముగిసిన వెంటనే ఎటువంటి నోటీసు లేకుండానే భూమి దేవస్థానం ఆధీనంలోకి వస్తుందని తెలిపారు.

‘ఉత్తి’పోతలే..!

నిరుపయోగంగా సీతానగరం ఎత్తిపోతల పథకం

- పనిచేయని విద్యుత్ మోటార్లు
- లీక్ అవుతున్న పైపులైన్లు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

గ్రామీణ ప్రాంతాల్లో బీడు భూములకు సాగు నీరు అందించి పొలాలను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేసి అవసరమున్న చోట ఎత్తిపోతల పథకాలు మంజూరు చేసింది. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఎత్తిపోతల పథకాలు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారుతున్నాయి. పుష్కలంగా నీరు ఉన్నా ఎత్తిపోతల పథకాలు మరమ్మతులకు గురి కావడంతో పంటలకు నీరు అందక రైతులు వర్షం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



నిరుపయోగంగా ఉన్న సీతానగరం ఎత్తిపోతల పథకం



కాలి తుప్పు పట్టిన విద్యుత్ మోటార్లు



ఇనుప గొట్టానికి రంధ్రం పడిన దృశ్యం

బోనకల్: మండలంలోని సీతానగరం గ్రామంలో నిర్మించిన ఎత్తిపోతల పథకం అధికారుల నిర్లక్ష్యంతో గత 10 ఏళ్లగా నిరుపయోగంగా మారింది. రైతులు సాగునీరు వసతి లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎత్తిపోతల పథకాన్ని ఆనాటి మధిర ఎమ్మెల్యే బోడేపూడి వెంకటేశ్వరరావు రైతుల కోసం సీతానగరం పెద్దవాగుపై ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాడు. 80 మంది రైతులకు సంబంధించి 280ఎకరాల భూమి ఈ ఎత్తిపోతల పథకం కింద సాగవుతుంది. ఈ పథకానికి 3 మోటార్లు అమర్చారు. 1160 మీటర్ల మేర నీటి సరఫరా కోసం పైపులైన్ నిర్మాణం చేపట్టారు. నీటి సరఫరా ఎగువ బాగానికి సరఫరా కావాల్సి ఉండగా పైప్‌లైన్ నిర్మాణం సక్రమంగా లేక తరచూ పగలిపోతున్నాయి. కొంత కాలం రైతులు డబ్బులు వేసుకొని మరమ్మతులు చేయించుకున్నారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో 280 ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారింది. అనేక సార్లు రైతులు అధికారులను కలిసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈ ఎత్తిపోతల పథకం కింద ఉన్న రైతులందరూ సన్న, చిన్నకారు రైతులే. గత 10 ఏళ్లగా ఈ పథకం పూర్తిగా మూలన పడింది. లిఫ్ట్ ఇనుప గొట్టం తుప్పుపట్టి చిల్లులు పడ్డాయి. విద్యుత్ మోటార్లు కాలిపోవడంతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. పేద రైతులు ఈ పొలాలపైనే జీవిస్తుండడంతో కొంత మంది రైతులు సొంతంగా మోటార్లను ఏర్పాటు చేసుకొని పంటలు పండించుకుంటున్నారు. మిగిలిన రైతుల భూములు బీళ్లుగా మారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేయించి రైతులకు సాగునీరు అందించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి..



లిఫ్ట్ కింద 2.50 ఎకరాల భూమి ఉంది. లిఫ్ట్ పనిచేయక పోవడంతో సాగు నీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మాగాణికి ప్రతిరోజు నీరు అవసరం కావడంతో వాగుపై ఆయిల్ ఇంజన్ ద్వారా నీరు పెట్టుకోవాల్సి వస్తుంది. డీజిల్ ధర అధికంగా ఉండడంతో పండిన పంట గిట్టుబాటు కావడం లేదు. లిఫ్ట్‌కు మరమ్మతులు చేయించాలి.

– నాగేశ్వరరావు, రైతు, బోనకల్

సొమ్ము వృథా అవుతోంది..



లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన ఈ లిఫ్ట్ పనిచేయక పోవడంతో సొమ్ము వృథా కావడంతో పాటు ఎంతో మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ మోటార్లు కాలిపోయి వాడక పోవడంతో తుప్పు పట్టి పోతున్నాయి. పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఉపయోగం లేదు.

– కటారు కృష్ణయ్య, రైతు, బోనకల్

‘పచ్చిరొట్ట’తో భూసారం పెరుగుతుంది



వేంసూరు: పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

వేంసూరు: సాగులో రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి, భూసారం పెంపొందించేందుకు పచ్చిరొట్ట విత్తనాలు ఉపయోగపడుతాయని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. ఆదివారం వేంసూరు సొసైటీలో రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులకు మంజురైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు చేరేలా కార్యకర్తలందరు ఇంటింటి ప్రచారం నిర్వహించాలని ఆరు నెలల్లో వేంసూరు మండలంలో రూ.150 కోట్ల అభివృద్ధి పనులు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, గ్రంథాలయ చైర్మన్ ఉమా మహేశ్వరరావు, గంగ్ర సోమిరెడ్డి, మండపాటి వేణు గోపాల్‌రెడ్డి, ఎండీ ఫైజుద్దీన్, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతకు ఎమ్మెల్యే సత్కారం..

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో పనిచేస్తున్న గణపనేని శ్రీనివాసరావుకు హైద్రాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రమశక్తి అవార్డు అందుకున్నారు. దీంతో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, టీబీజీకేఎస్ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, యూనియన్ నాయకులు, ఉద్యోగులు అభినందనలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో రమేష్‌బాబు, ఉపేంద్రాచారి, క్రాంతికుమార్, మురళీకృష్ణ, యూసుఫ్, నాగప్రసాద్, అఖిల్ విక్రమ్, అజ్గర్ అలీ, రెడ్డి, బాలాజీ, వెంకటేశ్వర్లు, కోటి, చంద్రశేఖర్ ఉన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం..

కల్లూరు రూరల్: సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న వీఆర్ఏల సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాత్ర కీలకమని వీఆర్ఏల సంఘం రాష్ట్ర జేఏసీ కోకన్వీనర్ రమేష్ బహదూర్, సెక్రెటరీ జనరల్ షేక్‌దాదు మియా, కోకన్వీనర్ రఫీ అన్నారు. కల్లూరులో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోకన్వీనర్ మాధవనాయుడు, రాములు, ఉమామహేశ్వరరావు, జిల్లా చైర్మన్ అజీజ్, డివిజన్ అధ్యక్షుడు జానీషరీఫ్, శ్రీనివాసరావు, హన్మంతురావు, బీఆర్ఎస్ నాయకులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



వైరా: రాస్తారోకో చేస్తున్న రైతులు, వివిధ పార్టీల నాయకులు



తల్లాడ: కలకొడిమలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

వైరా: ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని పలువురు నాయకులు అన్నారు. అకాల వర్షానికి తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక వ్యవసాయ మార్కెట్ వద్ద సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు బొంతు రాంబాబు, మాలోత్ రాందాస్ నాయక్, శీలం వెంకటనర్సిరెడ్డిలు మాట్లాడారు. మార్కెట్ యార్డ్‌లోకి ధాన్యం తీసుకొచ్చి నెలలు గడుస్తున్నా కాంటాలేయడం లేదన్నారు. కొనుగోళ్లలో జాప్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. సందర్భంగా రోడ్డుపై వాహనాలు భారీగా నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఏఎంసీ చైర్మన్ బీడీకే రత్నంతో కలిసి రైతులకు న్యాయం జరిపిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి..

తల్లాడ: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాతా భాస్కర్‌రావు అన్నారు. తల్లాడ మండలం కలకొడిమ గ్రామంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, జీవరత్నం, లాజరు, ముత్తయ్య, రమేష్, శ్రీను, వెంకటి, రైతులు పాల్గొన్నారు.

తడిసిన మక్కలను కొనుగోలు చేయాలి

బోనకల్: శనివారం రాత్రి కురిసిన వర్షాలకు మండలంలో లక్ష్మీపురం మార్క్‌ఫెడ్ కేంద్రంలో మొక్కజొన్నలు తడిచాయి. వీటిని లక్ష్మీపురం సొసైటీ చైర్మన్ మాదినేని వీరభద్రం ఆదివారం పరిశీలించారు. ఉన్నతాధికారులు స్పందించి కాంటాలు వేసిన బస్తాలను త్వరితగతిన గోడౌన్‌లకు తరలించాలని కోరారు.



తడిసిన మొక్కజొన్నలను పరిశీలిస్తున్న సొసైటీ చైర్మన్ వీరభద్రం

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన

ముదిగొండ: మండలంలోని వల్లబిలో నూతనంగా నిర్మించిన కంఠమహేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కంఠమహేశ్వస్వామి మాలాధారులు జలబిందెలతో గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. పురోహితులు మట్టపల్లి మల్లిఖార్జునశర్మ, మహంకాళి రామప్పశాస్త్రి, మట్టపల్లి రామప్పశాస్త్రి, బలగం భార్గవ్‌శర్మలు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, జలాదివాసం, దేవతల గ్రామోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విగ్రహప్రతిష్ఠలు..

వల్లబి కంఠమహేశ్వరస్వామి, సురమాంభదేవి, రేణుకాఎల్లమ్మ, వనంమైసమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమాలు సోమవారం ఉదయం అంత్యత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు పురోహితులు తెలిపారు.



జలబిందెలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న భక్తులు

ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో గల ముత్యాలమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొని అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కౌన్సిలర్ వీరపనేని రాధిక, బాబి, చల్లగుండ్ల కృష్ణయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రఫీ, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, భవాని, నర్సింహారావు, అనీల్, వెంకటేశ్వరరావు, చంటి, ప్రభాకర్, నాగు, నాని పాల్గొన్నారు.

రోహిణి నక్షత్ర పూజలు



గీతాజ్ఞాన మందిరంలో రోహిణి నక్షత్ర పూజలు చేస్తున్న భక్తులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీగీతాజ్ఞాన మందిరంలోగల శ్రీ పార్థసారధిస్వామి ఆలయంలో ఆదివారం స్వామి తిరునక్షత్రమైన రోహిణి నక్షత్ర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నవకలశ స్థాపన, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, భగవత్‌గీత పారాయణం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గుడివాడ వెంకటేశ్వరరావు, తిరునగరి వెంకటనర్సయ్య, ఏపూరి పురుషోత్తం, లీలాకృష్ణ, రాఘవయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఉపేందర్ గౌడ్

బోనకల్: ఈ నెల 27న ఖమ్మంలో జరిగే బీజేపీ నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని పార్టీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు ఉపేందర్ గౌడ్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వస్తున్నట్లు తెలిపారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ, నిరుద్యోగ సమస్య, ఇసుక మాఫియా తదితర విషయాలపై మాట్లాడనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ, యవకులు అధిగ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరావు, సురేష్, పరుశరాం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వైరా: సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

వైరా/కారేపల్లి: వైరాలో మధు విద్యాలయంలో 1993–94, కారేపల్లి హైస్కూల్‌లో 2004–05 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వివిధ వృత్తులలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు గత స్మృతులను నెమరువేసుకుంటూ తాము చదువుకున్న పాఠశాలలో కలియ తిరిగి తమ అనుబంధాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులైన వైరాలో మధు పాఠశాల చైర్మన్ మల్లెంపాటి వీరభద్రరావు, కారేపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చావా రామయ్య మాట్లాడుతూ.. తమ పాఠశాలలో చదివిన విద్యార్థులంతా ఉన్నత స్థానాలలో ఉండటం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లెంపాటి ప్రసాద్, రంజిత్, కారేపల్లిలో ఉపాధ్యాయులు కమలాదేవి, జాన్సీ, రేబకా, శశికళ, శ్రీలత, ఉమా, పీడీ శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు తిలక్ కిషోర్, శేఖర్, విక్రమ్, రమేష్, శైలజ, సరిత, శ్రీనివాస్, ఫని, రవి, రోహిత, యాకూబ్ పాషా, నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు, పలు ప్రధాన సెంటర్లలోని రాజీవ్ గాంధీ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. దేశానికి సాంకేతికతను తీసుకు వచ్చింది రాజీవ్ గాంధీయేనని అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



వైరా: రాజీవ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కల్లూరురూరల్: రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి సంభాని, నాయకులు



మధిరలో..



సత్తుపల్లిరూరల్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఏన్కూరులో..

ఎమ్మెల్యే కిశోర్‌ను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న బిక్షపతి మాదిగ

ఎర్రుపాలెం: దళితబంధు పథకం విషయంపై ఎమ్మార్పీఎస్ నాయకులను కొడుకులంటూ అవమానపరిచిన తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌ను సీఎం కేసీఆర్ సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్రా భిక్షపతి మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో జిల్లా కన్వీనర్ కూరపాటి సునీల్ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ నాయకులను అవమానపరుస్తూ మాట్లాడిన ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో గట్టి గుండె కిషోర్ మాదిగ, కూరపాటి ప్రభాకర్, కూరపాటి వరుణ్, గట్టి గుండె కమలాకర్, పత్తిపాటి ప్రఫుల్ కుమార్, కూరపాటి రాజు, నల్లగట్ల నాగేశ్వరరావు, సాగర్, విజయ్, గోపి తదితరులు ఉన్నారు.

బాల సాహిత్య సమ్మేళనానికి రచయిత రాజుకు ఆహ్వానం



బి.మధుసూదన్‌రాజు

సత్తుపల్లి: తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగే బాల సాహిత్య సమ్మేళనంలో పాల్గొనేందుకు సత్తుపల్లికి చెందిన బాల సాహిత్య రచయిత బొల్లేపల్లి మధుసూదన్‌రాజుకు ఆహ్వానం లభించింది. శాంత బయోటిక్ అధినేత, పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి తల్లి కోడూరి శాంతమ్మ జయంతి సందర్భంగా హైద్రాబాద్‌లో ఈ నెల 24, 25వ తేదీలలో బాల సాహిత్య సమ్మేళనం నిర్వహిస్తున్నారు. ఈ సమ్మేళనంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ప్రముఖ కవులు, తెలుగు ఉపాధ్యాయులు, బాల కవులు, రచయితలు, పాఠశాలల విద్యార్థులు వక్తలుగా, ప్రతినిధులుగా పాల్గొంటున్నట్లు మధుసూదన్‌రాజు తెలిపారు. హైద్రాబాద్‌లో జరిగే బాలసాహిత్య సదస్సులో తనకు ఆహ్వానం లభించినట్లు వివరించారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

మధిర: పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ అన్నారు. ఆదివారం రాయపట్నం గ్రామంలో పార్టీ జోనల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ స్థలాలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టిందని ఆరోపించారు. నల్ల డబ్బులు రద్దుచేసి ప్రజల ఖాతాల్లో రూ.15 లక్షల చొప్పున జమ చేస్తామని ఇచ్చిన హామీ నేటి వరకు నెరవేరలేదన్నారు. అదే విధంగా రాష్ట్రంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల, ఇళ్లస్థలాల పంపిణీ, రేషన్ కార్డులు, పెన్షన్ సమస్యలు తదితర వాటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు శీలం నరసింహారావు, మండల కార్యదర్శి మందా సైదులు, మద్దాల ప్రభాకర్, వడ్రాణపు మధు, వెంకాయమ్మ, సంపసాల గోపాలరావు, వీరయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

మధిరలో ఎర్రజెండా ఎగరడం ఖాయం..

ఎర్రుపాలెం: వచ్చే ఎన్నికల్లో మధిర నియోజకవర్గంలో సీపీఎం పోటీ చేస్తుందని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాలడుగు భాస్కర్ తెలిపారు. ఆదివారం మండలంలోని మామునూరు గ్రామంలో నిర్వహించిన పార్టీ జోన్ కమిటీ సమావేశానికి విచ్చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నామన్నారు. మధిరలో ఎర్రజెండా ఎగరడం కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. మతతత్వ బీజేపీని అధికారంలోకి రాకుండా ఆపడమే సీపీఎం ధ్యేయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, సగుర్తి సంజీవరావు, బేతి శ్రీనివాసరావు, లాలా, గొల్లపూడి కోటేశ్వరరావు, నల్లమోతు హనుమంతరావు, బండారు ఉపేంద్ర, రోహిత్, కరీం, కృష్ణ, వెంకటేశ్వరరావు, గురవారెడ్డి, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.